
# చార్జీలు పెంచిన టెల్కోలు

## 21 శాతం వరకు సవరించిన ఎయిర్‌టెల్ • వొడాఫోన్ ఐడియా 24 శాతం వరకు పెంపు

న్యూఢిల్లీ, జూన్ 28: మొబైల్ సబ్‌స్క్రైబర్లకు టెలికం సంస్థలు వరుసగా షాకిస్తున్నాయి. ఇప్పటికే టెలికం దిగ్గజం రిలయన్స్ జియో తమ టారిఫ్ చార్జీలను పెంచగా.. తాజాగా ఇదే జాబితాలోకి భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు కూడా చేరాయి. ఈ రెండు సంస్థలు కూడా తమ ప్లాన్ల ధరలను కూడా పెంచుతున్నట్లు శుక్రవారం ప్రకటించాయి. ఎయిర్‌టెల్ చార్జీలు వచ్చే నెల 3 నుంచి అమలులోకి రానుండగా, అదే వొడాఫోన్ ఐడియా చార్జీలు మాత్రం జూలై 4 నుంచి అమలులోకి రానున్నాయి.

**ఎయిర్‌టెల్ చార్జీలు వివరంగా..**

- వచ్చే నెల 3 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల ప్లాన్ల ధరలను 10–21 శాతం వరకు సవరించింది.
- రోజువారి డాటా 1జీబీపై చార్జీని రూ.3 పెంచింది. దీంతో ధర రూ.19 నుంచి రూ.22కి చేరుకున్నది.
- 365 రోజుల కాలపరిమితితో రోజుకు 2జీబీ డాటా ప్లాన్‌ను రూ.600 పెంచిం ది. దీంతో ఈ ప్లాన్ ధర రూ.2,999 నుంచి రూ.3,599కి చేరుకున్నది.
- అన్‌లిమిటెడ్ వాయిస్ ప్లాన్ టారిఫ్‌లను 11 శాతం వరకు పెంచింది. దీంతో 28 రోజుల కాలపరిమితితో 2జీబీ డాటా ప్లాన్ చార్జీని రూ.179 నుంచి రూ.199కి సవరించింది.
- 56 రోజుల కాలపరిమితితో రోజుకు 1.5 జీబీ డాటా ప్లాన్‌ను రూ.479 నుంచి రూ.579కి పెంచింది.
- అలాగే 28 రోజుల కాలపరిమితితో రోజుకు ఒక్క జీబీ డాటా ప్లాన్ చార్జీని రూ.265 నుంచి రూ.299కి, 1.5 జీబీ డాటా ప్లాన్‌ని రూ.299 నుంచి రూ. 349కి పెంచింది.
- 84 రోజుల వ్యాలిడిటీ ప్లాన్‌ను రూ.140 పెంచింది. రోజుకు 1.5 జీబీ డాటా ప్లాన్ చార్జీ రూ.719 నుంచి రూ.859కి, రోజుకు 2 జీబీ డాటా ప్లాన్ రూ.839 నుంచి రూ.979కి చేరుకున్నాయి.
- అలాగే పోస్ట్ పెయిడ్ రేట్లను కూడా 10–20 శాతం వరకు వడ్డించింది.




**వొడాఫోన్ ఐడియా కూడా..**

నష్టాల్లో నడుస్తున్న వొడాఫోన్ ఐడియా కూడా టారిఫ్ చార్జీలను పెంచుతున్నట్లు ప్రకటించింది. వచ్చే నెల 4 నుంచి అమలులోకి వచ్చేలా చార్జీలను 11 శాతం నుంచి 24 శాతం వరకు సవరించింది. ఎంట్రీ–లెవల్ ప్లాన్ కనీస చార్జీని 11 శాతం పెంచడంతో ఈ ప్లాన్ ధర రూ.179 నుంచి రూ.199కి చేరుకున్నది. అలాగే ప్రజాదరణ పొందిన 84 రోజుల కాలపరిమితి ప్లాన్‌ని రూ.719 నుంచి రూ.859కి పెంచింది. మరోవైపు రూ.2,899 వార్షిక ప్లాన్ చార్జీని 21 శాతం పెంచడంతో రూ.3,499కి చేరుకున్నది.

## బీఎస్‌డీఏ పరిమితి రూ.10 లక్షలు

న్యూఢిల్లీ, జూన్ 28: సెక్యూరిటీల మార్కెట్‌లో చిన్న మదుపరుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు మార్కెట్ రెగ్యులేటర్ సెబీ.. బేసిక్ సర్వీస్ డీమ్యాట్ అకౌంట్ (బీఎస్‌డీఏ) పరిమితిని శుక్రవారం రూ.10 లక్షలకు పెంచింది. ప్రస్తుతం ఇది రూ.2 లక్షలుగానే ఉండటం గమనార్హం. రెగ్యులర్ డీమ్యాట్ ఖాతాకు మరింత సరళతరమైన వెర్షనే ఈ బీఎస్‌డీఏ. చిన్న పోర్ట్‌ఫోలియోలతో ఉన్న మదుపరులపై డీమ్యాట్ చార్జీల భారాన్ని తగ్గించాలని 2012లో దీన్ని సెబీ పరిచయం చేసింది. సెప్టెంబర్ 1 నుంచి కొత్త మార్గదర్శకాలు అమల్లోకి వస్తాయని సెబీ తెలియజేసింది.

## ఎన్‌పీఎస్ ఖాతాదారులకు ఉత్సాహం

న్యూఢిల్లీ, జూన్ 28: నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) ఖాతాదారుల కోసం T+0 సెటిల్మెంట్‌ను పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్‌ఆర్డీఏ) అనుమతించింది. జూలై 1 నుంచి ఇది అమల్లోకి వస్తుంది. ఏదైనా సెటిల్మెంట్ రోజున ఉదయం 11 గంటల వరకు ట్రస్టీ బ్యాంక్ ద్వారా ఎన్‌పీఎస్ విరాళాలు అందినట్టైతే.. అదే రోజున (T+0) వాటిని పెట్టుబడిగా పెట్టడం జరుగుతుందని, అంతేగాక ఖాతాదారుల నికర ఆస్తి విలువ (ఎన్ఏవీ)కు కూడా దాని ప్రయోజనాన్ని జత చేస్తామని పీఎఫ్‌ఆర్డీఏ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. ఇప్పటిదాకా ట్రస్టీ బ్యాంక్.. సెటిల్మెంట్ జరిగిన తర్వాతి రోజున (T+1) అందిస్తున్నది. ఉదాహరణకు సోమవారం పనివేళలు ముగిసేదాకా వచ్చిన విరాళాలు.. మంగళవారం ట్రస్టీ బ్యాంక్ ద్వారా పెట్టుబడులకు వీలుగా అందుతున్నాయి. కానీ ఇకపై విరాళాలు గనుక ఉదయం 11 గంటలలోపు వస్తే.. అదే రోజున ట్రస్టీ బ్యాంక్ అందిస్తుందని పీఎఫ్ఆర్డీఏ తెలియజేసింది. దీంతో పెట్టుబడులు వెంటనే జరిగిపోతాయన్నది. ఇదిలావుంటే ప్రస్తుతం డీ–రెమిట్ విరాళాలను సెటిల్మెంట్ రోజు ఉదయం 9:30లోగా అందితేనే.. అదే రోజున ఇన్వెస్ట్ చేయడం జరుగుతున్నది. దీంతో ఈ సమయాన్ని కూడా ఉదయం 11 గంటలకు పొడిగించారు.











